సాక్షి నాగర్‌కర్నూల్
గురువారం ॥ 1 ॥ జూన్ ॥ 2023



కొలువుదీరిన పాలక మండలి
జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర ఆలయ పాలక మండలి బుధవారం కొలువుదీరింది.
వివరాలు 8లో ▸



నిలకడగా ఉల్లి ధరలు
దేవరకద్రలో బుధవారం జరిగిన ఉల్లిపాయల వేలంలో ధరలు నిలకడగా ఉన్నాయి.
వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
41.5 /20.4

వాతావరణం
ఉదయం నుంచి ఎండ తీవ్రత ఉంటుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై తేలిక పాటి వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వాహనాల వేలం



అచ్చంపేట రూరల్: అచ్చంపేట ఎక్సైజ్ కార్యాలయ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను బుధవారం ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఫయాజుద్దీన్ ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. 10 వాహనాలు వేలం వేయగా.. వాహనాలకు నిర్ణయించిన ధర రూ.7.40 లక్షలు కాగా.. వేలంలో రూ.9,95,920లు వచ్చాయి. ఈ నిధులు మొత్తం ప్రభుత్వ ఖజానాలో జమ చేశామని ఎక్సైజ్ ఎస్‌ఐలు బాలరాజు, సతీష్ తెలిపారు.

5 నుంచి కేవీపీఎస్ శిక్షణ తరగతులు



నాగర్‌కర్నూల్ రూరల్: దేశంలో పేట్రేగిపోతున్న మతోన్మాద హింసను అరికట్టడానికి రాజ్యాంగ, లౌకిక, ప్రజాస్వామ్య విలువలను రక్షించడానికి, సామాజిక ఉద్యమాలు నిర్మించాలనే లక్ష్యంతో సామాజిక కార్యకర్తలకు ఈ నెల 5, 6, 7 తేదీల్లో కల్వకుర్తిలో కేవీపీఎస్ రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని సంఘం జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న తెలిపారు. జిల్లాకేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం రాజకీయ శిక్షణ తరగతుల కరపత్రాలను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగాన్ని పూర్తిగా మార్చి దాని స్థానంలో మనుస్మృతిని ప్రవేశపెట్టాలని ఆర్‌ఎస్‌ఎస్ కనుసన్నల్లోని బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఆరోపించారు. ఇప్పటికే ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరణ చేయడం వల్ల రిజర్వేషన్లు రద్దయ్యి తీవ్రంగా నష్టపోతున్నారని, మత విద్వేషాలు రెచ్చగొట్టి సమాజంలో అశాంతి సృష్టించడం ద్వారా దేశ ప్రజల మధ్య చిచ్చు రేపుతున్నారన్నారు. ఇలాంటి చర్యలను అడ్డుకోవడానికి ఈ శిక్షణ తరగతులు ఉపయోగపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్, నాయకులు బాలచంద్రయ్య, మైబూస్, నర్సింహ, రాములు, ఎల్లమ్మ, రాములమ్మ పాల్గొన్నారు.

కళ్లకు గంతలు కట్టుకుని నిరసన



నాగర్‌కర్నూల్ రూరల్: జిల్లాకేంద్రంలోని జనరల్ ఆస్పత్రి కార్మికులు బుధవారం కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ల స్వలాభ కుట్రలతో నాగర్‌కర్నూల్ ప్రభుత్వ దవాఖానాలో పనిచేస్తున్న కార్మికులు మోసపోతున్నారని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శివశంకర్ ఆరోపించారు. ఆస్పత్రి కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం పెంచిన వేతనాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మూడు రోజులుగా జరుగుతున్న నిరవధిక నిరసనలో తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు. కార్మికుల సమస్యలపై జిల్లా అధికారులు మానవతా దృక్పథంతో స్పందించి వెంటనే కొత్త జీతాలను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 11 నెలలుగా కొత్త వేతనాలు తీసుకుంటున్నప్పటికీ నాగర్‌కర్నూల్‌లో మాత్రం వివక్ష ఎందుకని ప్రశ్నించారు. నిబంధనలు గాలికొదిలేసి కనీస వేతనాలు కూడా అమలు చేయకుండా అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏజెన్సీలు కూడా ఇలాంటి దుస్థితికి దిగజారడమేమిటని ప్రశ్నించారు. తక్షణమే కార్మికులతో చర్చలు జరిపి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్మికులు మణెమ్మ, గౌరమ్మ, సంతోషి, రేణుక పాల్గొన్నారు.

వేరుశనగ క్వింటా రూ.7,010

జడ్చర్ల/ దేవరకద్ర: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం వేరుశనగ క్వింటాల్‌కు గరిష్టంగా రూ.7,010, కనిష్టంగా రూ.4,509 ధరలు లభించాయి. అలాగే మొక్కజొన్నకు గరిష్టంగా రూ.1,821, కనిష్టంగా రూ.1,301, ఆముదాలు గరిష్టంగా రూ.5,400, కనిష్టంగా రూ.5,360, హంస గరిష్టంగా రూ.1,769, కనిష్టంగా రూ.1,200, ఆన్‌ఎన్‌ఆర్ గరిష్టంగా రూ.2,230, కనిష్టంగా రూ.1,589 పలికాయి.

సోనామసూరి ధర రూ.2,089
దేవరకద్ర మార్కెట్ యార్డులోజరిగిన ఈనామ్ టెండర్లలో సోనామసూరి ధాన్యం ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.2089, కనిష్టంగా రూ.2,041 చొప్పున వచ్చాయి. హంసకు గరిష్టంగా రూ.1,509, కనిష్టంగా రూ.1,459, ఆముదాలకు సరాసరిగా రూ.5,309 పలికింది.

బడిబాటకు వేళాయె



బిజినేపల్లి మండలం ఖానాపూర్‌లో బడిబయటి పిల్లల సర్వే చేస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్)

1 నుంచి పాఠశాలల్లో సన్నాహక కార్యక్రమాలు
- 3–17 వరకు స్పెషల్ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్
- 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం
- గతేడాది ప్రభుత్వ బడులు సాధించిన విజయాలపై అవగాహన
- పెద్దఎత్తున విద్యార్థులను చేర్పించేలా కసరత్తు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్/ కందనూలు: వేసవి సెలవులు పూర్తి కావడంతో విద్యార్థులు బడిబాట పట్టే సమయం వచ్చింది. 2023– 24 విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠశాలల పునఃప్రారంభంపై రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పాఠశాలలు ఈ నెల 12 నుంచి ప్రారంభమవుతున్న నేపథ్యంలో 2న తెలంగాణ అవతరణ దినోత్సవం జరగనుంది. అందుకోసం 1 నుంచి విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాలల్లో సన్నాహక కార్యక్రమాలు చేపట్టనున్నారు. మొదటిరోజు ఉపాధ్యాయులకు 3– 9వ తేదీ వరకు చేయాల్సిన కార్యక్రమాలకు సంబంధించి చేపట్టాల్సిన చర్యలపై ప్రభుత్వం సూచించనుంది. అందుకోసం ప్రొఫెసర్ జయశంకర్ 'బడిబాట' కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. గతేడాది పాఠశాలలు సాధించిన విజయాలను చూపిస్తూ.. ప్రైవేటుకు వెళ్లకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు ప్రోత్సహించాల్సి ఉంది.

విస్తృతంగా కార్యక్రమాలు
గురువారం నుంచి సన్నాహక కార్యక్రమంలో భాగంగా పాఠశాల స్థాయిలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు, తల్లిదండ్రులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్వయం సహాయక బృందాలు, ఆశ కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి బడిబాట కార్యక్రమం విజయవంతం చేసేందుకు రోజువారి కార్యక్రమాల ప్రణాళిక రూపొందించుకోవాల్సి ఉంటుంది. అనంతరం 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం పూర్తయ్యాక 3 నుంచి 9వ తేదీ వరకు బడిబాట కార్యక్రమం నిర్వహించాలి. దానికి అనుగుణంగా గ్రామంలో డోర్ టు డోర్ కార్యక్రమాలు ఉదయం 7 నుంచి 11 గంటల వరకు చేపట్టాలి. ర్యాలీల్లో బ్యానర్లు ప్రదర్శిస్తూ.. కరపత్రాలను పంచాలని అధికారులు సూచిస్తున్నారు. పాఠశాల అభివృద్ధి, మన ఊరు– మన బడితో పాఠశాలల్లో మార్పులు, ఇంగ్లిష్ మీడియం బోధన, ఎఫ్‌ఎల్‌ఎన్ వంటి కార్యక్రమాలపై అవగాహన కల్పించి విద్యార్థులు పాఠశాలల్లో చేరేలా చర్యలు తీసుకోవాలి. మధ్యాహ్న భోజనం, యూనిఫాం, పాఠ్యపుస్తకాలు వంటి ప్రయోజనాలను తల్లిదండ్రులకు వివరించాలి. పదో తరగతిలో విద్యార్థులు సాధించిన మార్కులు, ఇతర ఎన్‌సీసీ, సైన్స్, స్పోర్ట్స్ వంటి వాటిలో పాఠశాల విద్యార్థులు సాధించిన విజయాలను తల్లిదండ్రులకు వివరించాలి. మానసిక, శారీరక దివ్యాంగులైన 14 ఏళ్లలోపు విద్యార్థులను గుర్తించి వారిని స్థానిక భవిత కేంద్రాల్లో చేర్పించాలి.

ఉమ్మడి జిల్లా పరిధిలో ఇలా..

జిల్లా	పాఠశాలలు	విద్యార్థులు	ఉపాధ్యాయులు
మహబూబ్‌నగర్	852	75,922	3,482
నాగర్‌కర్నూల్	849	68,200	3,390
వనపర్తి	523	24,600	2,023
నారాయణపేట	493	48,777	2,020
జోగుళాంబ గద్వాల	451	45,380	1,971

హాజరు పెంపే లక్ష్యం..
విద్యా సంవత్సరం ప్రారంభంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా పెద్ద ఎత్తున విద్యార్థులను చేర్పించే విధంగా చూడాలని ప్రభుత్వం ఆదేశించింది. అందులో ప్రధానంగా బడిఈడు వచ్చిన పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలి. అలాగే అంగన్‌వాడీల నుంచి ఐదేళ్లు నిండిన పిల్లలను ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించాలి. విలేజ్ ఎడ్యుకేషన్ రిజిస్టర్‌లో విద్యార్థుల పేర్లు నమోదు చేయాల్సి ఉంటుంది. మరీ ముఖ్యంగా ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో చదువులు పూర్తి చేసుకుని ఉన్నత పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ప్రైవేటుకు వెళ్లకుండా ఉపాధ్యాయులు చర్యలు తీసుకుని వంద శాతం విద్యార్థులు బదిలీ అయ్యేలా పూర్తి వివరాలు ముందుగానే సేకరించాలి.

విజయవంతం చేస్తాం..



బడిబాట కార్యక్రమంలో భాగంగా ఈ నెల 3 నుంచి 17 వరకు వివిధ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల నమోదు శాతాన్ని గణనీయంగా పెంచేందుకు కృషిచేస్తాం. ప్రభుత్వం ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం ఎంఈఓలు కార్యక్రమంలో పాల్గొనాలి. ప్రజాప్రతినిధులను, స్కూల్ కమిటీలను, అంగన్‌వాడీ కార్యకర్తలను కలుపుకొని విజయవంతంగా కార్యక్రమాన్ని నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటాం.

– గోవిందరాజులు, డీఈఓ, నాగర్‌కర్నూల్, వనపర్తి

రోజువారి నివేదిక..
జిల్లా, మండల, పాఠశాల స్థాయిలో బడిబాట డెస్క్ ఏర్పాటు చేయనున్నారు. అందులో రాష్ట్రస్థాయిలో బడిబాటలో కొత్తగా చేరిన పిల్లల జాబితాను ప్రతిరోజూ నివేదించడానికి ఒక ఇన్‌చార్జ్‌ను, జిల్లాస్థాయిలో ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయడానికి ఒక అధికారిని నియమిస్తారు. అలాగే కేజీబీవీలో చేరిన విద్యార్థుల వివరాలను తెలియజేయడానికి జిల్లాస్థాయిలో కేజీబీవీఎస్, యూఆర్‌ఎస్ కోసం ప్రత్యేక బడిబాట డెస్క్ ఏర్పాటు చేయాలి. కొత్తగా చేరిన పిల్లలు, అంగన్‌వాడీ కేంద్రాల నుంచి వచ్చిన పిల్లలు, ప్రైవేట్ పాఠశాలల నుంచి వచ్చిన వారి వివరాలను సంబంధిత పాఠశాలల హెచ్‌ఎంలు, ఎంఈఓల ద్వారా ప్రతిరోజు బడిబాట కార్యక్రమం సందర్భంగా ఇచ్చిన పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. డేటా ఎంట్రీని పర్యవేక్షించడంతోపాటు వీరు రాష్ట్ర ప్రాజెక్ట్ కార్యాలయానికి రోజువారీగా నివేదించాలి.

ఘనకీర్తిని చాటేలా దశాబ్ది ఉత్సవాలు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

నాగర్‌కర్నూల్: తొమ్మిదేళ్ల ప్రగతి ప్రస్థానాన్ని, జిల్లా ఘనకీర్తిని చాటేలా తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. తెలంగాణ అవతరణ దినోత్సవం, దశాబ్ది ఉత్సవాలపై బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఉదయ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా, మండల స్థాయి అధికారులతో అవగాహన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ నెల 2 నుంచి 21 రోజులపాటు జరగనున్న వేడుకల్లో రోజుకో శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే వివిధ కార్యక్రమాలను ఘనంగా జరిపేందుకు ప్రతి నియోజకవర్గానికి ఒక ప్రత్యేకాధికారిని నియమించాలన్నారు. జిల్లాకు ఘనమైన కీర్తి ఉందని, పరిపాలన అద్భుతంగా కొనసాగతుందని, ఇది ప్రజాప్రతినిధులు, అధికారుల సమష్టి కృషితోనే సాధ్యమైందన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలను విజయవంతం చేసే బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ప్రభుత్వం ప్రకటించిన నిధులు సరిపోకుంటే ఎమ్మెల్యేలు సొంతంగా భరించేలా అందరితో మాట్లాడతానని చెప్పారు. ఉత్సవాల్లో భాగంగా ఏ రోజు ఎక్కడ ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలో సూచించారు. జెడ్పీచైర్‌పర్సన్ శాంతకుమారి మాట్లాడుతూ తెలంగాణ ఏర్పాటుతో గ్రామాల్లో మారిన రూపురేఖలను ప్రజలకు వివరించాలన్నారు. మహిళలకు స్ఫూర్తినిచ్చే కార్యక్రమాలను విరివిగా చేపట్టాలని కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ఉత్సవాలు వైభవోపేతంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కొల్లాపూర్ ఎమ్మెల్యే హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ వైభవాన్ని చాటిచెప్పేలా దశాబ్ది ఉత్సవాలను నిర్వహించాలన్నారు. ఎస్పీ మనోహర్ మాట్లాడుతూ సురక్ష దినోత్సవం రోజు ర్యాలీ ఏర్పాటు చేస్తామని, షీటీం, భరోసా, సైబర్ నేరాలు, తెలంగాణ పోలీసుల ప్రతిభ గురించి ప్రజలకు వివరిస్తామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మోతీలాల్, జిల్లా అటవీ శాఖాధికారి రోహిత్ గోపిడి, అన్ని శాఖల జిల్లా అధికారులు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణను దోచుకుంటున్నారు



లింగాల మండలం అంబట్‌పల్లిలో మంగళహారతులతో భట్టికి స్వాగతం పలుకుతున్న మహిళలు

- సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క
- లింగాల మండలానికి చేరుకున్న పీపుల్స్ మార్చ్ పాదయాత్ర
- మంగళ హారతులతో స్వాగతం పలికిన మహిళలు

లింగాల/ పెద్దకొత్తపల్లి: ఎంతోమంది త్యాగాల ఫలితంగా సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని కల్వకుంట్ల కుటుంబం దోచుకుంటుందని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క విమర్శించారు. పీపుల్స్ మార్చ్ పాదయాత్ర బుధవారం రాత్రి పెద్దకొత్తపల్లి మండలం దేదినేనిపల్లి ద్వారా లింగాల మండలంలోని అంబట్‌పల్లికి చేరుకుంది. ఈ సందర్భంగా జరిగిన కార్నర్ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. బీఆర్‌ఎస్ తొమ్మిదేళ్ల పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని, రెండు పర్యాయాలు జరిగిన ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలను గాలికి వదిలేశారని దుయ్యబట్టారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన సమయంలో మిగులు బడ్జెట్ ఉండేదని, నేడు పాలకుల తప్పిదాల వల్ల రూ.5 లక్షల కోట్ల అప్పులు అయ్యాయని ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించితేనే మన బతుకులు బాగుపడుతాయన్నారు. రాబోయే కాలంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న ఈ సమయంలో మోసం చేయడానికి పాలకులు వస్తున్నారని ప్రజలు జాగత్తగా ఉండాలని సూచించారు. స్థానికుడు కాని ఎమ్మెల్యే గువ్వల బాలరాజును ఈ ప్రాంతం నుంచి తరమికొట్టే సమయం ఆసన్నమైందన్నారు. అంతకు గ్రామంలోకి ప్రవేశించిన పాదయాత్రకు మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి, డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ, నాయకులు రంగినేని శ్రీనివాసరావు, జగదీశ్వర్‌రావు, వైస్ ఎంపీపీ లింగమ్మ, నారాయణగౌడ్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి నుంచి దేవినేనిపల్లి వరకు..
భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ పాదయాత్ర కొల్లాపూర్ నియోజకవర్గంలో ప్రజా సమస్యలు ఎత్తి చూపుతూ.. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ సాగింది. పెద్దకొత్తపల్లిలో జరిగిన కార్నర్ మీటింగ్‌కు కాంగ్రెస్ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. బుధవారం దేదినేనిపల్లి, పెద్దకార్పాములలో పంచాయతీ కార్మికులు వేతనాలు అందడం లేదని భట్టి విక్రమార్కకు మొరపెట్టుకున్నారు. దేవినేనిపల్లిలో రచ్చబండ వద్ద గ్రామస్తులు తమ సమస్యలను వివరించారు. అనంతరం భట్టి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 5 నెలల తర్వాత రేషన్ కార్డులు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఇంటికి రెండు పింఛన్లు అమలు చేస్తామన్నారు. ప్రతి రైతుకు ఏక కాలంలో రూ.2 లక్షల రుణమాఫీ, భూమిలేని నిరుపేదలకు ఏడాదికి రూ.12 వేలు, నిరుద్యోగులకు రూ.4 వేల నిరుద్యోగ భృతి చెల్లిస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో కొల్లాపూర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

వైభవంగా శ్రీరంగనాథస్వామి కల్యాణం



రంగనాథస్వామి, గోదాదేవి కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

కందనూలు: గోవింద నామస్మరణతో శ్రీపురం మార్మోగింది. శ్రీపురవాస గోవిందా.. శ్రీరంగనాథ గోవిందా అంటూ భక్తుల పారవశ్యం నడుమ శ్రీరంగనాథస్వామి కల్యాణం కనులపండువగా నిర్వహించారు. సుమారు 500 ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీపురం శ్రీరంగనాయకస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం తిరు కల్యాణం వేద పండితుల మంత్రోచ్చరణాల మధ్య కమనీయంగా సాగింది. లోకకల్యాణార్థం నిర్వహించిన ఈ కల్యాణం కోసం ఆలయంలో భారీ ఏర్పాట్లు చేశారు. బ్రహ్మోత్సవ వేళ అత్యంత పవిత్రమైన శ్రీరంగనాథుడి కల్యాణాన్ని తిలకించేందుకు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. బీజేపీ రాష్ట్ర నేత దిలీప్‌చారితోపాటు పలువురు నేతలు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. గ్రామస్తులకు అన్నదానం చేశారు.

ఉత్సాహంగా రథోత్సవం..
ఆలయం వద్ద బుధవారం రాత్రి రథోత్సవం (తేరు) నిర్వహించారు. సుమారు 20 అడుగుల ఎత్తైన భారీ రథం మీద శ్రీగోదా సమేత రంగనాథ స్వామివారిని ఉంచి ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. వేలాది మంది భక్తులు చిన్నా పెద్దా తేడా లేకుండా రథాన్ని లాగేందుకు పోటీపడ్డారు. గోవిందా.. గోవిందా.. అంటూ రథాన్ని ఆలయం చుట్టూ లాగుతూ మొక్కులు చెల్లించుకున్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

ఓటరు నమోదుకు మరో అవకాశం

స్పెషల్ సమ్మరీ రివిజన్ షెడ్యూల్ ప్రకటన
- జిల్లాలో ప్రారంభమైన ఇంటింటి సర్వే
- ఈ నెల 23 వరకు కొత్త ఓటరు నమోదు, చేర్పులు, మార్పులు..
- అక్టోబరు 4న తుది ఓటరు జాబితా ప్రకటన



అచ్చంపేట: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిది. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికి భారత రాజ్యాంగం ఓటు హక్కు కల్పించింది. ఇందుకు అనుగుణంగా ఎన్నికల సంఘం ఏటా ఓటరు జాబితా సవరణ చేపడుతోంది. కొత్త ఓటర్ల నమోదుతోపాటు చనిపోయిన ఓటర్ల తొలగింపు, చిరునామా, ఇతర చేర్పులు, మార్పులకు అవకాశం కల్పిస్తోంది. ఈ ఏడాది జనవరి 5న ఓటరు తుది జాబితా ప్రకటించింది. ప్రస్తుతం ఎన్నికల సంవత్సరం నేపథ్యంలో ఓటరు జాబితా సవరణకు మరోమారు అవకాశం కల్పించింది. స్పెషల్ సమ్మరి రివిజన్ కింద ఇంటింటి సర్వేకు షెడ్యూల్ ప్రకటించింది. గత నెల 25 నుంచి జూన్ 23 వరకు బీఎల్‌ఓలు క్షేత్రస్థాయిలో కొత్త ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు చేయనున్నారు. ఈ మేరకు ఓటరు జాబితా సవరణపై రెవెన్యూ అధికారులు ఆయా రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాలు సైతం నిర్వహిస్తున్నారు.

షెడ్యూల్ ఇలా..
కొత్త ఓటరు నమోదుతోపాటు తొలగింపులు, చేర్పులు, మార్పులకు స్పెషల్ సమ్మరీ రివిజన్ షెడ్యూల్ ప్రకటించింది. పోలింగ్ కేంద్రాల వారీగా బీఎల్‌ఓలు గత నెల 25 నుంచి జూన్ 23 వరకు ఇంటింటి సర్వే చేపడుతారు. జూలై 25 నుంచి 31 వరకు పరిశీలన, ఆగస్టు 2న ముసాయిదా జాబితా విడుదల, 31 వరకు అభ్యంతరాల స్వీకరణ చేపడుతారు. సెప్టెంబర్ 22న అభ్యంతరాలపై వివరణ అనంతరం అక్టోబరు 4న తుది జాబితా విడుదల చేస్తారు.

జిల్లాలో ఓటర్ల వివరాలు..

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
నాగర్‌కర్నూలు	259	1,06,055	1,05,230	3	2,11,288
అచ్చంపేట	265	1,09,469	1,08,485	2	2,17,956
కల్వకుర్తి	262	1,10,975	1,06,061	6	2,17,042
కొల్లాపూర్	268	1,09,515	1,05,075	4	2,14,594

నమోదు చేసుకోవాలి..
స్పెషల్ సమ్మరీ రివిజన్ కింద ఓటరు జాబితా సవరణకు ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. బీఎల్‌ఓలతో ఇంటింటి సర్వే చేపట్టి కొత్త ఓటరు నమోదు, చేర్పులు, మార్పులు చేపడుతాం. 25 అక్టోబరు 2023 నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఆన్‌లైన్‌లో లేదా బీఎల్‌ఓలను సంప్రదించి ఓటరుగా నమోదు చేసుకోవచ్చు.
– పాండునాయక్, ఆర్డీఓ, అచ్చంపేట

పోలింగ్ కేంద్రాల గుర్తింపు
జూన్ 24 నుంచి జూలై 24 వరకు పోలింగ్ కేంద్రాలను గుర్తించి, వాటిలో సౌకర్యాలను పరిశీలిస్తారు. ఒక కేంద్రంలో 1,500 మంది ఓటర్లు ఉండేలా చూస్తున్నారు. అవసరం అనుకుంటే కొత్త వాటిని ప్రతిపాదిస్తారు. పాత కేంద్రాల్లో సరైన సౌకర్యాలు లేకుంటే దానికి సమీపంలోనే కొత్తవి గుర్తించాల్సి ఉంటుంది. అయితే ప్రతి కేంద్రాన్ని ఫొటో తీసి ఎన్నికల సంఘానికి నివేదించాలి.

కొత్త సాఫ్ట్‌వేర్..
ఎన్నికల సంఘం కొత్త సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఓటరు నమోదు, మార్పులు, తొలగింపుల ప్రక్రియలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి ఈఆర్వోనెట్ 2.0ను వినియోగిస్తుంది. ప్రస్తుతం ఇందులోనే కొత్త ఓటర్ల దరఖాస్తులు నమోదు చేస్తున్నారు. ప్రతిఒక్కరు వారి ఓటరు జాబితాను సరి చూసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఏమైనా తప్పులు దొర్లితే తిరిగి దరఖాస్తు చేసుకోవాలి.

క్లుప్తంగా

ఈతకు వెళ్లి బావిలో బాలుడి గల్లంతు



గోపాల్‌పేట: ఈతకు వెళ్లి బాలుడు బావిలో మునిగిపోయిన సంఘటన వనపర్తి జిల్లా రేవల్లి మండలంలోని చెన్నారంలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాన్‌గల్ మండలం గోప్లాపూర్‌కు చెందిన రాంచందర్, ఎల్లమ్మకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరు హైదరాబాద్‌లో నివాసం ఉండేవారు. మంగళవారం చెన్నారంలో కుటుంబ సభ్యుల పుట్టినరోజు ఉండటంతో గ్రామానికి వచ్చారు. ఇదే క్రమంలో రాంచందర్ చిన్నకుమారుడు అశోక్ (14) చిన్నపిల్లలతో కలిసి గ్రామ శివారులో ఉండే ఆకుతోట బావికి ఈతకు వెళ్లాడు. అశోక్ హైదరాబాద్‌లో అప్పుడప్పుడూ స్విమ్మింగ్ పూల్‌కు ఈతకు వెళ్లేవాడు. ఆకుతోట బావిలోకి దూకిన అతడు మునిగిపోయాడు. దీంతో చుట్టుపక్కల వారు అరిచి కేకలు పెట్టగా.. అప్పటికే బాలుడు మునిగిపోయాడు. బావి వద్దకు పోలీసులు, గజఈతగాళ్లు వచ్చి వెతికినా బాలుడు కనిపించలేదు.

బావిలో పడి యువకుడి మృతి

బల్మూర్: మండలంలోని పోలిశెట్టిపల్లి గ్రామ బావిలో పడి మతిస్థిమితం లేని యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ఆ వివరాలు.. గ్రామానికి చెందిన భాస్కర్(34) కొంతకాలంగా తాగుడుకు బానిసై మతిస్థిమితం కోల్పోయాడు. ఈ క్రమంలో బుధవారం గ్రామంలోని పాతబావిలో పడిపోయాడు. గమనించిన గ్రామస్తులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి అచ్చంపేట ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. సిబ్బంది మృతదేహాన్ని బయటకు తీశారు. కాగా మృతుడికి 10ఏళ్ల క్రితం వివాహమైంది. భార్య ఐదేళ్ల క్రితం భర్తను వదిలి దూరంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

నీటిగుంతలో పడి వ్యక్తి..

భూత్పూర్: మండలంలోని తాటికొండ సమీపంలో బుధవారం నీటిగుంతలో పడి వ్యక్తి మృతిచెందినట్లు ఎస్‌ఐ.భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు.. మండలంలోని పోతుల మడుగుకు చెందిన మనెమోని చంద్రశేఖర్(46) మంగళవారం తాటికొండలోని బంధువులైన దశనమోని రవి కూతురు వివాహానికి వెళ్తున్నట్లు ఇంట్లో భార్య వెంకటమ్మకు చెప్పి వెళ్లాడు. వివాహం ముగించుకొని తిరిగి పోతులమడుగు వస్తుండగా మార్గమధ్యలో జాతీయ రహదారి పక్కన ఉన్న నీటిగుంతలో పడి మృతిచెందాడు. బంధువుల సమాచారం మేరకు వెళ్లి చూడగా నీటిగుంతలో పడి చనిపోయి ఉన్నాడు. బహిర్భూమికి వెళ్లి గుంతలోపడి మృతి చెంది ఉండవచ్చని, తమకు ఎవరిపై ఎలాంటి అనుమానంలేదని మృతుని భార్య వెంకటమ్మ తెలిపారు. వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ.భాస్కర్‌రెడ్డి తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా: డ్రైవర్ దుర్మరణం



మహేష్ (ఫైల్)

కోస్గి: ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడడంతో తీవ్రగాయాలపాలైన డ్రైవర్ చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంసభ్యులు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా.. మండలంలోని మీర్జాపూర్‌కి చెందిన మహేష్(26) అదే గ్రామంలోని ఓ వ్యక్తి దగ్గర ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామంలోని ట్రాక్టర్లు మంగళవారం గ్రామ శివారులోని చెరువు నుంచి అవసరమైన రైతుల పొలాలకు ఒండ్రుమట్టి తరలించేందుకు వెళ్లాయి. ఒండ్రుమట్టి తరలించే క్రమంలో వేగంగా వెళ్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడటంతో మహేష్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని వెంటనే ఓ ప్రైవేట్ వాహనంలో పాలమూర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి ఎల్లప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. మృతుడికి ఏడాది క్రితమే వివాహం కాగా అంతలోనే మృతి చెందడంతో బాధిత కుటుంబం విషాదంలో మునిగిపోయింది.

సంతానం కలగలేదని మహిళ ఆత్మహత్య

మల్దకల్: వివాహమై రెండేళ్లు గడిచినా సంతానం కలుగకపోవడంతో మనస్తాపానికి గురైన మహిళ ఉరి వేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మల్దకల్‌కి చెందిన భూపతి రెండేళ్ల కిందట అయిజ మండలం సింధనూరుకు చెందిన పల్లవి(22)ని వివాహం చేసుకున్నాడు. రెండేళ్లు అయినా సంతానం కలుగలేదు. ఆస్పత్రుల్లో వైద్యం చేయించినా ఫలితం లేకపోవడంతో మనస్తాపం చెందిన పల్లవి మంగళవారం రాత్రి ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను ఆస్పత్రికి తరలించారు. కానీ అప్పటికే మృతి చెందిందని వైద్యులు తెలిపారు. మృతురాలి తండ్రి బడేసాబ్ ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేశామని ఎస్‌ఐ శేఖర్ తెలిపారు.

కొలువుదీరిన జోగుళాంబ పాలక మండలి

- ఆలయ కమిటీ చైర్మన్‌గా చిన్న కృష్ణయ్య నాయుడు
- జోగుళాంబ సన్నిధిలో పాలకవర్గం ప్రమాణ స్వీకారం
- సమష్టిగా క్షేత్ర అభివృద్ధికి కృషి: జెడ్పీచైర్‌పర్సన్ సరిత, ఎమ్మెల్సీ చల్లా, మందా జగన్నాథం



పాలక మండలి సభ్యులతో జెడ్పీచైర్‌పర్సన్ సరిత, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, మందాజగన్నాథం తదితరులు

అలంపూర్/జోగుళాంబశక్తిపీఠం: అష్టాదశ శక్తిపీఠాల్లో ఒకటైన జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర ఆలయ నూతన పాలక మండలి బుధవారం కొలువుదీరింది. అమ్మవారి సన్నిధిలో ప్రజా ప్రతినిధులు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, అభిమానుల మధ్య నూతన ఆలయ పాలకమండలి ప్రమాణ స్వీకారం నిర్వహించారు. రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ జీ. శ్రీనివాసరాజు, ఆలయ ఈఓ పురేందర్ ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం నిర్వహించారు. కార్యక్రమానికి జెడ్పీచైర్‌పర్సన్ సరిత, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఢిల్లీలో అధికార ప్రతినిధి మందా జగన్నాథంతోపాటు ఆయా మండలాల ప్రజా ప్రతినిధులు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు హాజరవడంతోపాటు ఆలయాలను దర్శించుకున్నారు. వీరికి ఈఓ పురేందర్ కుమార్ అర్చకులతో కలిసి పూర్ణకుంభ స్వాగతం పలికారు.

అమ్మవారి సన్నిధిలో ప్రమాణ స్వీకారం

ఆలయ నూతన పాలక వర్గం జోగుళాంబ అమ్మవారి సన్నిధిలో ప్రమాణ స్వీకారం చేసింది. ముందుగా ఆలయ పాలక మండలి సభ్యులు బి.చిన్నకృష్ణయ్య నాయుడు, సి. చంద్రకళ, వెంకటనారాయణరెడ్డి, రఘు ధనుంజయ, బి సత్యన్న, కే. వెంకటేశ్వర్ రెడ్డి, సి.వెంకటేశ్వర్లు, బి. అంపయ్య, గొల్ల కేశన్న, అడివప్ప, కె. సత్యనారయణ, కె.రమేష్ బాబు, ఎం.సురేఖ, ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఆలయ ముఖ్య అర్చకుడు డి.ఆనంద్ శర్మతో అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరాజు ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఈఓ పురేందర్ వారిని శాలువాతో సత్కరించారు.

అందరి సహకారంతో అభివృద్ధి: జెడ్పీచైర్‌పర్సన్ సరిత

నూతన పాలక మండలి అందరి సహకారంతో ఆలయాలను అభివృద్ధి చేయాలని జెడ్పీచైర్‌పర్సన్ సరిత అన్నారు. ధర్మబద్ధంగా ప్రజలకు సేవలు చేయాలన్నారు. దేశ వ్యాప్తంగా జోగుళాంబ అమ్మవారు ఐదో శక్తి పీఠంగా ఖ్యాతి పొందిందని, క్షేత్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎంతో అభివృద్ధి చేసిందన్నారు. రాబోయే కాలంలో పార్టీలకు, మతాలకు అతీతంగా అందరు కలిసి సేవలందించాలన్నారు. ఇదిలాఉండగా, సమావేశాల్లో ప్రొటోకాల్ పాటించాలని ఆమె సూచించారు.

రుణపడి ఉంటాం: చిన్నకృష్ణయ్య నాయుడు

చైర్మన్ పదవి ఇవ్వడం సంతోషంగా ఉందని అవకాశం కల్పించినందుకు రుణపడి ఉంటామని ఆలయ పాలక మండలి చైర్మన్ చిన్న కృష్ణయ్య నాయుడు అన్నారు. జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆశీస్సులతో ఈ అవకాశం దక్కిందన్నారు.

చైర్మన్‌గా చిన్న కృష్ణయ్య నాయుడు

అలంపూర్ క్షేత్ర ఆలయ కమిటీ చైర్మన్‌గా అలంపూర్ మండలం కోనేరుకి చెందిన భజన మండలి సభ్యుడు చిన్న బి. చిన్న కృష్ణయ్య నాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రమాణ స్వీకారం అనంతరం కమిటీ సభ్యులలో సి.చంద్రకళ, వెంకటేశ్వర్ రెడ్డి చిన్న కృష్ణయ్య నాయుడు పేరును ప్రతిపాదించారు. సభ్యులు అమోదించడంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. అనంతరం ఆలయ సముదాయంలోని చైర్మన్ చాంబర్‌లో ప్రజాప్రతినిధులు నూతన చైర్మన్‌ను కుర్చీలో కూర్చోబెట్టి శాలువాతో సత్కరించారు.

యాదాద్రి తరహాలో క్షేత్ర అభివృద్ధి: ఎమ్మెల్సీ చల్లా

జోగుళాంబ క్షేత్రాన్ని మరో యాదాద్రి తరహా అభివృద్ధి చేయాలని సీఎం కేసీఆర్‌తో కోరినట్లు ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి అన్నారు. పాలక మండలి సన్మాన సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఏకైక శక్తి పీఠ క్షేత్రం ఇక్కడ ఉండటం గర్వకారమన్నారు. వేలాది మంది భక్తులు, యాత్రికులు ఈక్షేత్ర సందర్శనకు విచ్చేస్తారన్నారు. కొలువుదీరిన నూతన పాలక మండలి సభ్యులు భక్తులకు కావాల్సిన అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలన్నారు. జోగుళాంబ ఆలయ కమిటీని తిరుపతి దేవస్థానం కమిటీ వలే తీర్చిదిద్దడానికి సీఎం కేసీఆర్‌తో మాట్లాడటం జరిగిందని ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి మందా జగన్నాథం అన్నారు. అభివృద్ధి అనేది ఒక్కసారితో పూర్తికాదన్నారు. అభివృద్ధి నిరంతర ప్రక్రియ అన్నారు.

ఆలయాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామన్నారు. అందరి సహకారంతో భక్తుల సౌకర్యాల కల్పనకు తమవంతుగా పని చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్లు మనోరమ, కరుణశ్రీ, ఎంపీపీలు, బేగం, అశోక్ రెడ్డి, జెడ్పీటీసీ శంషాద్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

పతకాలు సాధించి దేశం గర్వపడేలా చేయాలి



కరాటే క్రీడాకారులను అభినందిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

- రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ క్రీడలు: ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పతకాలు సాధించి దేశం గర్వపడేలా చేయాలని రాష్ట్ర ఎక్సైజ్,క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, పంజాబ్ రాష్ట్రాలకు చెందిన 15 మంది కరాటే క్రీడాకారులు ఈనెల 29 నుంచి జూలై 1 వరకు అమెరికాలో జరిగే ప్రపంచ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా థాయిలాండ్, మలేషియాల్లో వారం రోజుల పాటు జరిగే శిక్షణ శిబిరానికి వెళుతున్న కరాటే క్రీడాకారులను బుధవారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తమ క్యాంప్ కార్యాలయంలో అభినందించారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రవేశపెట్టిన క్రీడాపాలసీ కారణంగా క్రీడల్లో తెలంగాణ నంబర్‌వన్‌గా నిలిచిందన్నారు. క్రీడాకారులకు ప్రభుత్వం అండగా ఉంటూ వారు ప్రపంచస్థాయి క్రీడల్లో రాణించేందుకు తోడ్పాటు అందిస్తున్నట్లు తెలిపారు. కోచ్ రవి, కెప్టెన్ లక్ష్మి, తెలంగాణకు చెందిన సహదేవ్, సాజిదా, రవి సహ 15 మంది క్రీడాకారులను మంత్రి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, ముడా చైర్మన్ గంజి వెంకన్న, డైరెక్టర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ఎంపీ సమీక్ష



ఎంపీకి సమస్యలు తెలుపుతున్న టీఆర్‌ఎస్ నాయకుడు కిషోర్

దోమలపెంట: దోమలపెంటలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు బుధవారం సమీక్షించారు. శ్రీశైలంలో దర్శనం కోసం వచ్చిన ఆయన, అనంతరం ఈగలపెంటలోని జెన్‌కో అతిథిగృహం, కృష్ణవేణిలో భూగర్భ కేంద్రం సీఈ సూర్యనారాయణరావు, సీఈ టెక్నికల్ అధికారి శ్రీధర్, సివిల్ ఈఈ రమేష్ తదితరులతో కలిసి ప్రజాసమస్యలపై సమీక్షించారు. నీటి ఎద్దడి, అర్ధాంతరంగా నిలిచిపోయిన మిషన్ భగీరథ పనులు, అంతర్గత రహదారులు తదితర సమస్యలను టీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు నంద కిషోర్ ఎంపీ దృష్టికి తెచ్చారు. గ్రామంలో నీటిఎద్దడి తీరాలంటే జెన్‌కో నీటి సరఫరా బాధ్యతలను చేపడితేనే తీరుతుందని అన్నారు. ఇరిగేషన్ శాఖలో ప్రస్తుతం ఐదుగురు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారని, మరో నెలరోజుల్లో ఒకరు రిటైర్ అవుతున్నారని తెలిపారు. గతంలో శ్రీశైలం ప్రాజెక్టు ఇరిగేషన్ శాఖ వారు అన్నీ చేసేవారని తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి వారు బాధ్యతల నుంచి తప్పుకోవడంతో దోమలపెంటలో ప్రజలు నాలుగు రోజులకోసారి నీటి సరఫరా, వైద్య సేవలు ఆచరణలో లేక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ రాములు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జెన్‌కో ఎస్‌టీ ఉద్యోగ సంఘం నాయకులు ఎస్‌సీ, ఎస్‌టీ క్యాచ్ రూల్స్ సమస్యలపై ఎంపీకి వినతిపత్రం అందజేశారు. నాగయ్యగౌడ్, ఏఈ అనీల్‌గౌడ్, పాండునాయక్, నానుచౌహాన్, బిక్కులాల్, హనుమ, 1104 సంఘం రాష్ట్ర నాయకులు సునీల్ పాల్గొన్నారు.

రైతు మృతిపై కేసు నమోదు

అడ్డాకుల: ఇద్దరు రైతుల మధ్య జరిగిన గెట్టు పంచాయితీ.. తోపులాటలో తీవ్రంగా గాయపడిన ఓ రైతు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మూసాపేట మండలం నందిపేటలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ విజయభాస్కర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రావుల యాదిరెడ్డి(60), రాంరెడ్డి ఇరుగు పొరుగు రైతులు. కొన్నాళ్ల నుంచి ఇద్దరి మధ్య పొలం గెట్టు పంచాయితీ నడుస్తోంది. ఈక్రమంలోనే సోమవారం రాంరెడ్డి డోజర్‌తో వివాదాస్పద స్థలంలో చదును చేస్తున్నాడు. దీన్ని గమనించిన యాదిరెడ్డి అక్కడికి వెళ్లి డోజర్‌ను అడ్డుకున్నాడు. ఇద్దరి మధ్య గెట్టు పంచాయతీ తేలక ముందే పొలం ఎలా చదును చేస్తావని ప్రశ్నించడంతో ఇద్దరి మధ్య స్వల్పంగా తోపులాట జరిగింది. ఈక్రమంలో రాంరెడ్డి నెట్టడంతో యాదిరెడ్డి పొలం ఒడ్డుపై పడిపోయాడు. దీంతో తీవ్రంగా గాయపడిన యాదిరెడ్డిని చుట్టు పక్కల రైతులు కుటుంబ సభ్యులతో కలిసి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ యాదిరెడ్డి మృతి చెందాడు. ఆయనకు భార్య సత్యమ్మ, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మంగళవారం మృతుని భార్య సత్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విజయభాస్కర్ తెలిపారు.

రేవంత్‌రెడ్డికి పోటీగానే భట్టి పాదయాత్ర



మాట్లాడుతున్న గువ్వల బాలరాజు

నాగర్‌కర్నూల్: కాంగ్రెస్ పార్టీలో రేవంత్‌రెడ్డికి పోటీగానే భట్టి విక్రమార్క పాదయాత్ర చేస్తున్నారని, ఆయన పాదయాత్ర వల్ల ప్రజలకు ఒరిగిందేమీ లేదని ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. బుధవారం నాగర్‌కర్నూల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ శాంతకుమారి, ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డితో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంగళవారం అచ్చంపేటలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించడంతోపాటు అచ్చంపేట లిఫ్ట్ ఇరిగేషన్ మంజూరు చేసినందుకు రైతులతో కలిసి కృతజ్ఞతలు తెలిపేందుకు సభ నిర్వహించామని, చేస్తున్న అభివృద్ధిని చూడకుండా మంత్రి హరీశ్‌రావుపై విమర్శలు చేయడం సరికాదన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావును విమర్శిస్తే సహించేది లేదన్నారు. భట్టి విక్రమార్క పాదయాత్ర అచ్చంపేటలోకి అడుగు పెట్టేకంటే ముందు హరీశ్‌రావుకు క్షమాపణ చెప్పాలని, లేకుంటే తగిన బుద్ధి చెప్తామన్నారు. ఉచిత ప్రచారం కోసమే కాంగ్రెస్ నాయకులు గందరగోళం సృష్టిస్తున్నారని విమర్శించారు. 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఏం చేశారో భట్టి విక్రమార్క సమాధానం చెప్పాలన్నారు. కాంగ్రెస్ నాయకుడు లేని పార్టీ అన్నారు. కర్ణాటకలో మతతత్వ పార్టీకి ఓటు వేయలేక ప్రజలు గత్యంతరం లేక కాంగ్రెస్‌కు పట్టం కట్టారన్నారు. ఈ నెల 6న నాగర్‌కర్నూల్‌కు సీఎం కేసీఆర్ వస్తున్నారని, నూతన కలెక్టరేట్, ఎస్పీ, బీఆర్‌ఎస్ జిల్లా పార్టీ కార్యాలయం ప్రారంభిస్తారన్నారు. అదేరోజు జిల్లా కేంద్రంలో 1.50 లక్షల మందితో సభను ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని వివరించారు. ఎమ్మెల్యే బీరం మాట్లాడుతూ కాంగ్రెస్‌లో ఉన్న వర్గపోరులో ఎవరు గొప్ప అని తేల్చుకునేందుకే భట్టి పాదయాత్ర చేస్తున్నారని విమర్శించారు. ఆయన చేస్తున్నది పీపుల్స్ లెస్ మార్చ్ అని ఎద్దేవా చేశారు. సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్ రఘునందన్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ దుకాణం సీజ్

గద్వాల క్రైం: డ్రగ్ నిబంధనలు, అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న మెడికల్ దుకాణాన్ని బుధవారం జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్‌రఫీ సీజ్ చేశారు. వివరాలిలా.. గద్వాలలోని కృష్ణరోడ్డు మార్గంలో ఇటీవల కేపీఎన్ ఆస్పత్రిని ఏర్పాటు చేశారు. అయితే ఆస్పత్రి యాజమాన్యం డ్రగ్ నిబంధనలు, అనుమతులు లేకుండా మందులను విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు అందాయి. దీంతో ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన మెడికల్ దుకాణాన్ని పరిశీలించి 17 రకాల మందులను సీజ్ చేసి కేపీఎన్ యాజమాన్యంపై డ్రగ్ అండ్ కాస్మొటిక్ యాక్టు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఎవరైన మెడికల్ దుకాణం ఏర్పాటు చేయాల్సిన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు.

తప్పిన ప్రమాదం



మహబూబ్‌నగర్ క్రైం: టిఫిన్ సెంటర్‌లో ప్రమాదవశాత్తు సిలిండర్‌లో మంటలు వ్యాప్తి చెందడంతో నిర్వాహకులు భయాందోళనకు గురయ్యారు. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో ఉన్న విఘ్నేశ్వర టిఫిన్ సెంటర్‌లో బుధవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో టిఫిన్ చేయడానికి ఉపయోగించే సిలిండర్‌లో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దీంతో నిర్వాహకులు సిలిండర్ బయటకు తీసుకువచ్చి తడి గోనె సంచి సిలిండర్‌పై వేసి మంటలను అదుపు చేయడానికి ప్రయత్నించారు. దాదాపు అరగంట తర్వాత మంటలను అదుపులోకి వచ్చాయి. భారీ ప్రమాదం తప్పడం వల్ల టిఫిన్ చేయడానికి వచ్చిన వారితో పాటు స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

జిన్నింగ్‌మిల్లులో అగ్ని ప్రమాదం

జడ్చర్ల: స్థానిక ఇండస్ట్రియల్ ఏరియాలో కొనసాగుతున్న మహేశ్ జిన్నింగ్ మిల్లులో బుధవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. మిల్లులోని పత్తికి ప్రమాదవశాత్తు నిప్పంటుకుని మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన మిల్లు నిర్వాహకులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. దీంతో ఫైర్ సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని మంటలను నియంత్రించారు. మంటలు అదుపులోకి వచ్చినట్లు ఫైర్ సిబ్బంది తెలియజేశారు. కాగా అగ్నికి ఆహుతయిన నష్టం వివరాలు అంచనా వేయాల్సి ఉందని, మిల్లు నిర్వాహకులు వివరించారు.

విద్యుత్ చౌర్యం: వ్యక్తికి రిమాండ్

నర్వ: విద్యుత్ చౌర్యం కేసులో రెండోసారి విద్యుత్ విజిలెన్స్ అధికారులకు పట్టుబడటంతో ఆ వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు అధికారులు తెలిపారు. మండలంలోని యాంకికి చెందిన రాములు తండ్రి ఉప్పరి సుతారి వెంకప్ప(43) పిండిగిర్ని నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో 2022 ఏప్రిల్‌లో పిండిగిర్నికి అక్రమంగా విద్యుత్‌ను వాడడంతో పట్టుకున్న అధికారులు మొదటి తప్పుగా భావించి జరిమానా వేశారు. తిరిగి అదేపని చేస్తూ మరోసారి అధికారులకు పట్టుబడ్డాడు. దీంతో అతడిని మహబూబ్‌నగర్ ట్రాన్స్‌కో పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. రెండో కేసు నమోదు చేసి నారాయణపేట జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చారు. 14రోజులు రిమాండ్ విధించడంతో, మహబూబ్‌నగర్ జిల్లా జైలుకు తరలించామని ట్రాన్స్‌కో విజిలెన్స్ పోలీస్ స్టేషన్ సీఐ రవీందర్‌రెడ్డి, ఎస్‌ఐ అంజయ్య తెలిపారు.

జూరాలలో 8 టీఎంసీలకు చేరిన నీటి నిల్వ

ధరూరు: డెడ్ స్టోరేజీకి చేరిన ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు నీటి మట్టం క్రమక్రమంగా పెరిగి 8 టీఎంసీలకు చేరింది. 15 రోజులుగా ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న స్వల్ప ఇన్‌ఫ్లో ఉండడంతో దాదాపు ఐదు టీఎంసీల నీరు వచ్చి చేరింది. బుధవారం సాయంత్రం ప్రాజెక్టులో 8.029 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రస్తుతం ఎగువ నుంచి 1,069 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతున్నట్లు అధికారులు తెలిపారు. 178 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ వేసవిలో తాగునీటికి ఇక్కట్లు ఎదురయ్యే సమయంలోనే ఎగువన కురిసిన వర్షాలతో ఊరట లభించింది.

తాగునీటికి 20 క్యూసెక్కులు వినియోగం

మదనాపురం: రామన్‌పాడు జలశయంలో బుధవారం నీటిమట్టం 1,019 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ, సమాంతర కాల్వకు నీటి విడుదలను నిలిపివేశామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి, తెలియజేశారు.

రాష్ట్రస్థాయి సీఎం కప్ వాలీబాల్ చాంపియన్ పాలమూరు



జిల్లా జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి తదితరులు

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి సీఎం కప్ వాలీబాల్ పోటీల్లో జిల్లా పురుషుల జట్టు అద్భుతమైన ప్రదర్శన కనబరిచింది. టోర్నీలో మొదటి నుంచి మెరుగైన విజయాలు సాధించిన వాలీబాల్ జట్టు సెమీఫైనల్, ఫైనల్‌లో అదే రీతిలో దూకుడు ప్రదర్శించింది. మొదటగా సెమిఫైనల్ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ జట్టు 25- 15, 25- 22 సెట్లలో రంగారెడ్డి జిల్లా జట్టుపై గెలుపొందింది. బుధవారం సరూర్‌నగర్‌లో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో జిల్లా జట్టు 25- 15, 25- 17 సెట్లలో మెదక్ జట్టుపై గెలుపొంది విజేతగా నిలిచింది. విజేత జిల్లా జట్టుకు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్) చైర్మన్ ఆంజనేయగౌడ్, ఎమ్మెల్యే నోముల భగత్ తదితరులు అభినందించి ట్రోఫీ అందజేశారు.

టూడేస్ లీగ్‌లో ప్రతిభచాటాలి



క్రికెట్ ప్రాబబుల్స్ క్రీడాకారులతో ఎండీసీఏ ప్రతినిధులు

మహబూబ్‌నగర్ క్రీడలు: ఈ నెల మొదటి వారంలో జరిగే హెచ్‌సీఏ టూడేస్ లీగ్‌లో జిల్లా క్రీడాకారులు ప్రతిభచాటాలని మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ అన్నారు. జిల్లాకేంద్రం పిల్లలమర్రి సమీపంలోని ఎండీసీఏ మైదానంలో బుధవారం హెచ్‌సీఏ టూడేస్ లీగ్‌లో పాల్గొనే ఉమ్మడి జిల్లా అండర్- 25 క్రికెట్ క్రీడాకారుల ఎంపికలను ఎండీసీఏ ప్రతినిధులు ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ హెచ్‌సీఏ టూడేస్ లీగ్‌లో గతంలో జిల్లా జట్టు మెరుగైన ప్రదర్శన కనబరిచారన్నారు. ఎంపికైన క్రీడాకారులు టూడేస్ లీగ్‌లో రాణించాలని కోరారు. లీగ్‌లో ప్రతిభచాటే క్రీడాకారులకు భవిష్యత్‌లో మంచి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. 30 మందితో కూడిన ప్రాబబుల్స్ క్రీడాకారులను ఎంపిక చేశామని, వీరికి మ్యాచ్ నిర్వహించి ప్రతిభకనబరిచిన వారిని తుది జట్టులోకి తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎండీసీఏ ఉపాధ్యక్షులు సురేష్‌కుమార్, కోచ్ అబ్దుల్లా పాల్గొన్నారు.

క్రీడాకారుల ప్రాబబుల్స్..

హర్షవర్ధన్, గణేష్, అబ్దుల్ రాఫే, సైఫుర్ రహెమాన్, కిషోర్, షాదాబ్, డేవిడ్, అంకిత్ రాయ్, అభిలాష్‌గౌడ్, శ్రీకాంత్, సాయిప్రమోద్, అద్నాన్, ప్రతీప్, సిద్ధార్థ, సురేష్, ముఖితుద్దీన్ (మహబూబ్‌నగర్), కాశీం (వనపర్తి), పవన్, అరవింద్, రాజు, గణేష్, టి.నరేష్ (గద్వాల), శివన్, రేవంత్, వర్షిత్ రెడ్డి (జడ్చర్ల), పి.నిఖిల్ (నారాయణపేట), నిరంజన్ (నాగర్‌కర్నూల్), సందీప్ (షాద్‌నగర్), హర్ష (పెబ్బేర్), ఆదిత్య (అప్పంపల్లి) ఎంపికయ్యారు.

నిలకడగా ఉల్లి ధరలు

- గరిష్టంగా రూ.1,100
- కనిష్టంగా రూ.700



దేవరకద్ర మార్కెట్‌లో ఉల్లిని కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

దేవరకద్ర: దేవరకద్ర మార్కెట్‌లో బుధవారం జరిగిన ఉల్లిపాయల బహిరంగ వేలంలో ధరలు నిలకడగా ఉన్నాయి. సీజన్ ప్రారంభం అయి నాలుగు నెలలు పూర్తయినా.. ధరలు అటు ఇటుగా ఉన్నాయి తప్పా.. పెద్దగా మార్పు లేదు. బుధవారం మార్కెట్‌కు వచ్చిన ఉల్లిని వేలం వేయగా.. క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.1,100, కనిష్ఠంగా రూ.700 వరకు ధరలు పలికాయి. స్థానిక వ్యాపారులతో పాటు బయటి నుంచి వచ్చిన వ్యాపారులు, చిరు వ్యాపారులు వేలంలో పాల్గొన్నారు. ప్రస్తుతం మార్కెట్‌కు వచ్చిన ఉల్లి నాణ్యంగా ఉండటంతో చాలా మంది వినియోగదారులు ఉల్లిని కొనుగోలు చేశారు. మార్కెట్‌లో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉల్లి వ్యాపారం జోరుగా సాగింది. ఇక మార్కెట్ బయట కూడా ఉల్లి బస్తాలను రైతులు నేరుగా విక్రయించారు. 50 కిలోల బస్తా ధర రూ.500 నుంచి రూ.600 వరకు అమ్మకాలు సాగించారు. మార్కెట్‌లో 45 కిలోల బస్తాను రూ.350 నుంచి రూ.500 వరకు విక్రయించారు.